క్లుప్తంగా

పాఠశాలలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ఇచ్చోడ: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాల, బాలికల ఆశ్రమ పాఠశాలలో సోమవారం ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 46 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. మరో 6 గురు విద్యార్థినుల రక్త నమూనాలు సేకరించారు. వర్షకాలంలో సీజనల్ వ్యాధుపై అప్రమత్తంగా ఉండాలన్నారు. హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కైలాస్ పాల్గొన్నారు. అలాగే తలమద్రిలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రశాంత్, హెల్త్ అసిస్టెంట్ సూభాష్‌లు పాల్గొని సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు.

కుమారి గ్రామంలో..

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైష్ణవి, ఏఎన్‌ఎం రాణి, ఆశ కార్యకర్త పుష్పలత, అంగన్‌వాడీ కార్యకర్త సుమలత పాల్గొన్నారు.

రూ.32 వేలకు లడ్డూ సొంతం



లడ్డూతో ఎన్రాల నగేశ్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన లడ్డూ వేలం పాటలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్రాల నగేశ్ రూ. 32 వేలకు దక్కించుకున్నారు. లడ్డూ సొంతం చేసుకోవడం పట్ల బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, నాయకులు సిద్ధూ, మయూర చంద్ర, తదితరులు అభినందించారు.

ఉర్దూ జర్నలిస్టులకు శిక్షణ

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ద్వారా హైదరాబాద్‌లో ఆగస్టు 30, 31 తేదీల్లో అన్ని జిల్లాలకు చెందిన ఉర్దూ జర్నలిస్టులకు ద్విదిన శిక్షణ శిబిరం నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి సీనియర్ జర్నలిస్ట్ షాహిద్ అహ్మద్ తవ్వకల్ పర్యవేక్షణలో ఖీజర్ అహ్మద్ యాఫయీ, ఉమైమ్ షరీఫ్, మహ్మద్ షఫీ, అష్ఫాక్ అహ్మద్, రకీబ్ యాఫయీక్‌లు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

బోథ్: సొనాల మండల కేంద్రంలోని దళితవాడలో 15 నెలలుగా విద్యుత్ సమస్య వేధిస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. ముఖ్యంగా 1వ, 2వ వార్డులో విద్యుత్ సమస్య అధికంగా ఉందన్నారు. తరచూ లోవోల్టేజీతో సమస్య వల్ల విద్యుత్ కోతలు ఉంటున్నాయని, దీంతో తాము ఇబ్బంది పడుతున్నామన్నారు. ప్రతీ రోజు ఉదయం 7:30 గంటల నుంచి రెండు, మూడు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో రెండు డీటీఆర్‌లు గతంలో ఉండగా.. ప్రస్తుతం ఒకటే ఉందని, దీని వల్ల సమస్య ఏర్పడుతోందని అన్నారు. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు.

సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రతిభ

బజార్‌హత్నూర్: ఆదిలాబాద్ పట్టణంలో సోమవారం నిర్వహించిన విభాగ్ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో మండల కేంద్రంలోని శ్రీసర్వతి శిశు మందిర్ విద్యార్థులు చట్ల రిషివర్ధన్ ఎనర్జీ కన్స్‌ర్వేషన్ ప్రయోగంలో, అంగ రిశ్వత్ మోడల్ అగ్రికల్చర్ ప్రయోగంలో మొదటి బహుమతి సాధించారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు వొర్ని వెంకట రమణ, ఉపాధ్యాయలు స్వప్న, రమణ, ప్రవీణ్‌లు అభినందించారు.

పాఠశాలలో వసతులు కల్పిస్తాం



సమస్యలు తెలుసుకుంటున్న రాథోడ్ రవీందర్

సాత్నాల: పాఠశాలలో వసతులు కల్పిస్తామని డీఆర్‌డీఏ రాథోడ్ రవీందర్ అన్నారు. సోమవారం భోరజ్ మండలం గిమ్మ పాఠశాలను కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు శనివారం సందర్శించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రామస్తులు చెప్పిన సమస్యలన్నీ దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో గాజుల సన్ని, నీలం శ్రీకాంత్, శ్రీరామ్, మురళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరదొస్తే ఆగాల్సిందే..!



నిపాని బ్రిడ్జిపై వద్ద నిలిచిన రాకపోకలు

- లోలెవల్ వంతెనలతో ఇబ్బందులు
- రాకపోకలకు అంతరాయం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

తాంసి: ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులతో, పాటు చెరువుల్లో భారీగా వరదనీరు వచ్చి చేరింది. వాగులు సైతం వరదనీటితో ఉప్పొంగి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లోలెవల్ వంతెనలపై నుంచి వరదనీరు భారీగా ప్రవహించడంతో గంటల తరబడి రాకపోకలు స్తంభిస్తున్నాయి. తాంసి, భీంపూర్ మండలంలో పలు గ్రామాల మధ్య ఉన్న వాగుల వద్ద ఉన్న లోలెవల్ వంతెనలతో ఇబ్బందులు తప్పడం లేదు. వరద ప్రవాహం తగ్గే వరకు అక్కడే వేచి ఉండాల్సి వస్తోంది.

పలుచోట్ల లోలెవల్ వంతెనలు..

తాంసి మండలంలో జిల్లా కేంద్రం నుంచి మహారాష్ట్ర వైపు వెళ్లే అంతరాష్ట్ర రోడ్డుపై హస్నాపూర్ గ్రామం వద్ద ఉన్న లోలెవల్ వంతెన, పొన్నారి గ్రామ సమీపంలోని లోలెవల్ వంతెనలపై నుంచి వరదనీరు ప్రవహించడంతో అంతరాష్ట్ర రోడ్డుపై వాహనాల గంటల తరబడి రాకపోకలు నిలిచిపోతాయి. భీంపూర్ మండలంలోని నిపాని సమీపంలో ఉన్న వాగుతో పాటు ధనోర వాగు వద్ద ఉన్న లోలెవల్ వంతెన, అంతర్గాం సమీపంలో ఉన్న లోలెవల్ వంతెనపై నుంచి వరదనీరు గంటల కొద్ది ప్రవహిస్తూ ఉంటుంది. భారీ వర్షాలు కురిస్తే రాకపోకలు బంద్ అవుతాయి. ఏమైనా అత్యవసర పరిస్థితులు ఉంటే ఇతర మార్గాల ద్వారా వెళ్లడం లేదా వరదనీరు ప్రవాహం తగ్గే వరకు అక్కడే వేచి ఉండాల్సిన వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హైలెవల్ బ్రిడ్జిలు నిర్మించాలని..

ఆయా గ్రామాల మధ్య అంతరాష్ట్ర రోడ్డుపై నిర్మించిన లోలెవల్ వంతెనల నిర్మాణం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఎత్తుపల్లాలతో పాటు వరద ఉధృతిని పట్టించుకోకుండా నిర్మించారు. వరద ఉధృతి ఎక్కువైనప్పుడల్లా రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. వరద ప్రవాహం తగ్గేంత వరకు గంటల కొద్ది వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. వరదను అంచనా వేయకపోతే వాహనాలు అదుపు తప్పి ప్రమాదాల భారిన పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి హైలెవల్ వంతెనలు నిర్మించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రాకపోకలకు అంతరాయం



పలు గ్రామాల మధ్య ఉన్న అంతరాష్ట్ర రోడ్డుపై లోలెవల్ వంతెనలు ఉన్నాయి. అంతర్గాం సమీపంతో పాటు నిపాని గ్రామాల సమీపంలో వాగులు ఉప్పొంగి ప్రవహిస్తాయి. ధనోర సమీపంలోని బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. అధికారులకు ఇప్పటికే పలు మార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

– జజ్జిరి రాకేశ్‌యాదవ్, భీంపూర్

మహాధర్నాకు తరలిన నాయకులు



ధర్నాలో పాల్గొన్న ఉపాధ్యాయులు



హైదరాబాద్‌కు వెళ్తున్న పీఆర్టీయూ నాయకులు

బోథ్: బోథ్: సీపీఎస్ రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పీఆర్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బోథ్, సొనాల మండలాల ఉపాధ్యాయులు హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన మహాధర్నాకు తరలివెళ్లారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని కోరారు.

సీపీఎస్ రద్దు చేయాలి

భీంపూర్: రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి వెంటనే ఓపీఎస్ విధానం అమలు చేయాలని పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు గంపల ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర శాఖ పిలుపుమేరకు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌లో నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమానికి సోమవారం బయలుదేరి వెళ్లారు. సీపీఎస్ రద్దయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రావుత్ శ్రీనివాస్, జంగిలి శ్రీనివాస్, సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: సీపీఎస్ విధానం రద్దు చేయాలని మండలంలోని లక్కారిపేట ఏహెచ్‌ఎస్ బాయ్స్ పాఠశాలలో టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ్‌రావు, వి ఠల్, సీతాబాయి, మధుసుధన్, రమేశ్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: సీపీఎస్ వద్దు, ఓపీఎస్ ముద్దని మేడిగూడ ఆశ్రమ పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు స్వర్ణలత అన్నారు. సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా సోమవారం పాఠశాలలో భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల న్యాయ్యమైన డిమాండ్‌ను పునరుద్ధరించాలన్నారు. ధర్నాలో ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి ఎంపీడీవోగా జీవన్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న జీవన్‌రెడ్డి

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి ఎంపీడీవో భాస్కర్ పదవి విరమణ పొందగా.. ఇంద్రవెల్లి ఎంపీవోగా విధులు నిర్వర్తిస్తున్న జీవన్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీ కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది శాలువాతో సన్మానించారు. ఇంద్రవెల్లి ఎంపీడీవోగా మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఏపీవో జాదవ్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు సంజీవ్‌రావు, ప్రవీణ్‌కుమార్, రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్ ప్రాంగణంలోని మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాలలో కుంకుమార్చన పూజలు చేశారు. విద్యార్థినుల సంస్కృతిక నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం

నేరడిగొండ: బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో సోమవారం రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం చేశారు. మోదీ తల్లిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా అంబేడ్కర్ చౌక్‌లో నిరసన చేపట్టారు. మండల అధ్యక్షుడు ఆకుల రాజశేఖర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్ రెడ్డి, ఆడెపు రమేశ్, సురేశ్, ఉత్తమ్ సింగ్, రంజిత్, భీంరావ్, దుర్వ రాజు, శ్రీధర్‌రెడ్డి, ఆత్రం భీంరావ్, విలాస్ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: రాహుల్‌గాంధీ సమక్షంలో ప్రధాని నరేంద్రమోదీ తల్లిని అవమానపరిచే విధంగా మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షులు పోరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం చేసేందుకు ప్రయత్నం చేయడంతో ఎస్సై సంజయ్ కుమార్ అడ్డుకున్నారు. నాయకులు కొత్త శంకర్, చట్ల సుఖ్‌దేవ్, ఉత్తం, గజానంద్, సంతోష్, మహేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

అంబేడ్కర్ కాలనీలో ఆవుల బీభత్సం

బోథ్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి ఆవుల గుంపు బీభత్సం సృష్టించాయి. నిరుపేద కుటుంబానికి చెందిన ఆర్ష చిన్న పోశెట్టి ఇంట్లోకి చొరబడి వస్తువులను, వంట సామగ్రిని చిందరవందర చేశాయి. వెంటనే కాలనీవాసులు స్పందించి ఆవులను తరిమివేశారు. ఈ ఘటనపై హమాలీ సంఘం అధ్యక్షుడు మల్యాల రాజేశ్వర్ మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబమైన పోశెట్టిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, ఆవుల బెడద వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, గ్రామ పంచాయతీ కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

తలమడుగు: గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని తహసీల్దార్ రాజ్‌మోహన్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రతిష్ఠించిన మహాగణపతి వద్ద మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డితో కలిసి పూజలు చేశారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో బాబాన్న, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, ఆర్ఐలు రోహిదాస్, అశోక్, రమేశ్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత

గుడిహత్నూర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గృహోపకరణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు బాల వికాస్ స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని సీతాగోంది గ్రామంలో 20 కుటుంబాలకు గృహోపకరణాలు అందజేశారు. సభ్యులు ప్రాషత్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ అరుగుల సంతోష్ గౌడ్, మహేశ్ పాటిల్, కాడే నర్సింగ్, జంగు, మాల్కు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వొద్దు'

బేల: సుప్రీం కోర్టులో కేసు తుది తీర్పుకు వచ్చినందుకు లంబాడాలకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వొద్దని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడ శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీ ఎంపీ, ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టులో తెలంగాణలో లంబాడాలు ఎస్టీ కాదు అని వేసిన కేసు చివర దశలో ఉందన్నారు. ఎప్పుడైనా తీర్పు వచ్చే అవకాశం ఉందని, అప్పటిదాకా లంబాడాలకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాల జారీ చేయవద్దన్నారు. సమావేశంలో రాయిసెంటర్ మండల ప్రధాన కార్యదర్శి కొడప భీంరావు, నాయకులు సిడాం నందకుమార్, పెందుర్ రాందాస్, కొడప రవి, పర్చకి గణేష్, ఆడ సంతోష్, నాగోరావు, తదితరులు పాల్గొన్నారు.

కస్తూరిబా విద్యాలయం తనిఖీ

బేల: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సోమవారం జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి ఉదయశ్రీ తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి ఫిజిక్స్‌వాలా, ఖాన్ అకాడమీ ఆన్‌లైన్ క్లాసులపై ఆరా తీశారు. ఆరోగ్య పాఠశాల పురోగతిపై ప్రత్యేకాధికారి గేడాం నవీనకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

మెడికల్ షాపులకు నోటీసులు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆవరణలో గల మూడు మెడికల్ షాపులకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత ఇటీవల నోటీసులు జారీ చేశారు. ఆస్పత్రి ఆవరణలోని మెడికల్ షాపులపై ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు అందగా ఆమె తనిఖీ చేసి నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. మెడికల్ షాపుల్లో ఫార్మసిస్టులకు బదులు ఇతర వ్యక్తులు ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తే మెడికల్ షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

తెలంగాణ తల్లి చిత్రపటానికి జలాభిషేకం

ఉట్నూర్‌రూరల్: కాళేశ్వరం ప్రాజెక్టు గురించి కాంగ్రెస్ చేస్తున్న అసత్య ప్రచారానికి నిరసనగా సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్ విద్యార్థులతో కలిసి తెలంగాణ తల్లి చిత్రపటానికి కాళేశ్వరం నది జలాలతో జలాభిషేకం చేసి, నిరసన తెలిపారు. వేల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించే సంకల్పంతో నిర్మించిన అద్భుత కట్టడం కాళేశ్వరం ప్రాజెక్టు అన్నారు. ప్రాజెక్టు గురించి కాంగ్రెస్ పార్టీ అసత్య ప్రచారాలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మహమ్మద్ ముజీబ్ షేక్ సాజిద్, సాయి, కేశవ్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

బోథ్: ఇటీవల అవార్డులు అందుకున్న బూస లక్ష్మణ్, అనిల్ మాసంలను బోథ్ పట్టణ పద్మశాలి సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆదిలాబాద్ ఎస్పీ చేతుల మీదుగా ఉత్తమ పోలీస్ అవార్డు అందుకున్న బూస లక్ష్మణ్, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సొసైటీ అవార్డు అందుకున్న మాసం లక్ష్మి సొసైటీ చైర్మన్ మాసం అనిల్‌లను పద్మశాలి సంఘం నాయకులు శాలువాతో సత్కరించారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు



సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న శ్రీనివాస రెడ్డి



సంబురాలు జరుపుకుంటున్న నాయకులు

ఇంద్రవెల్లి: రాష్ట్ర అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును ఆమోదించడంతో సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద టపాసులు కాల్చారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పాలనతోనే సామాజిక న్యాయం లభిస్తుందన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలపడం ద్వారా రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, కాంగ్రెస్ నాయకులు మీర్జా యాకుబ్‌బేగ్, పడ్వాల్ గోపాల్ సింగ్, సోమోరే నాగోరావ్, వరుణ్ ఫడ్, సోమసే కిషోర్, జునైద్, సూర కొమరయ్య పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: స్థానిక సంస్థలో బీసీలకు 42 శాతం రిజ్వేషన్లను అసెంబ్లీలో ఆమోదించిన సందర్భంగా ఉట్నూర్ మండలంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు సోమవారం సంబురాలు జరుపుకున్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇక్బాల్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్యలు మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే ఆశయాల మేరకు 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును పాస్ చేయించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దూట రాజేశ్వర్, మహేందర్, మర్సుకోల తిరుపతి, మాజీ సర్పంచ్ జగదీశ్, ఫహీం, అర్షద్ పాల్గొన్నారు.

కైలాస్‌నగర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించడంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాసేవ భవన్‌లో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌక్‌లో సంబురాలు జరుపుకున్నారు.

పరిహారం రూ. 25 వేలు అందించాలి

తలమడుగు: పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 25 వేల పరిహారం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్థికంగా నష్టపోయిన రైతుల గురించి వరద బాధితుల గురించి అసెంబ్లీ సమావేశాల్లో చర్చించకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ నాయకులకు పదవులు తప్పా.. ప్రజా సమస్యలు పట్టవన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా సీనియర్ నాయకులు కాటిపెల్లి వసంత్ రెడ్డి, తోట వెంకటేశ్, శ్రీనివాస్ రెడ్డి, రామ్ కిషన్, సుదర్శన్ రెడ్డి, చంటి, రవికాంత్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జోగు రామన్న

ముగిసిన పంట నష్టం సర్వే

సాత్నాల: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రైతులు నష్టపోయారు. భోరజ్ మండలంలోని పలు గ్రామాల్లో పత్తి, సోయాబీన్, కంది పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయశాఖ అధికారులు మండల వ్యాప్తంగా పంట నష్టం సర్వే పూర్తి చేశారు. మండల వ్యవసాయాధికారి అశ్రఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. మొత్తం 2032 ఎకరాలలో పంట నష్టం జరిగిందని, పత్తి 1880 ఎకరాలు, సోయాబీన్ 353 ఎకరాలు, కంది 68 ఎకరాలలో నష్టం జరిగినట్లు పేర్కొన్నారు. సర్వే నివేదికను కలెక్టర్‌కు సమర్పించినట్లు వెల్లడించారు.



సర్వే చేస్తున్న వ్యవసాయాధికారి

సీపీఐ నాయకుడు గంగారెడ్డి కన్నుమూత



గంగారెడ్డి (ఫైల్)

బోథ్: సీపీఐ, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు అయిటి గంగారెడ్డి (75) అనారోగ్యంతో సోమవారం ఉదయం 4 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఈ సందర్భంగా సీపీఐ శ్రేణులు, కార్మిక సంఘాల నాయకులు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్, బి. గోవర్ధన్, బీడీ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. దాసు, గోదావరి, సీపీఐ నాయకులు భోజన్నలతో సహా పలువురు ముఖ్య నాయకులు హాజరయ్యారు. గంగారెడ్డి సేవలను స్మరించుకున్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు

తాంసి: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించిన గణపతి మండపాల వద్ద ప్రతీ రోజు భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో సోమవారం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. పలుచోట్ల అన్నదానం చేపట్టారు.

సాత్నాల: భోరజ్ మండలం గిమ్మ గ్రామంలో సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి వినాయకులకు ప్రత్యేక పూజలు చేశారు. తమ గ్రామానికి విచ్చేసిన ఆమెకు కమిటీ సభ్యులు శాలువా కప్పి సత్కరించారు.

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామంలో గల వివిధ మండపాల వద్ద గణనాథుడిని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు.



హోమంలో పాల్గొన్న జంటలు



పూజలు చేస్తున్న భక్తులు



ఇచ్చోడలో అలంకరించిన మహాలక్ష్మీ ప్రతిమలు

లక్ష్మీదేవికి పూజలు

ఇంద్రవెల్లి/ఇచ్చోడ: ఆయా మండలాల్లోని గ్రామాల్లో సోమవారం మహిళలు లక్ష్మీదేవి పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహాలక్ష్మీ ప్రతిమలను ఇంట్లో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేస్తారు. ప్రత్యేకంగా తయారు చేసిన పిండి వంటలు తయారు చేసి నైవేద్యాలుగా సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. పంటలు సమృద్ధిగా పండాలని, కుటుంబసభ్యులు ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

కూలిన ప్రహరీ

బోథ్: సొనాల మండలంలోని సాకెర గ్రామానికి చెందిన రాథోడ్ సుభద్ర బాయికి చెందిన ఇంటి గోడ ఇటీవల కురిసిన వర్షాలకు కూలింది. గత కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో వర్షానికి ఒక్కసారిగా గోడ కూలిపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.